క్లుప్తంగా

వైభవంగా సత్తెమ్మతల్లి వార్షికోత్సవం



అచ్చంపేట: మండలంలోని కొండూరు శివారు శ్రీనివాసతండాలో వేంచేసినయున్న సత్తెమ్మతల్లి 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో ఎమ్మెల్యేని సత్కరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి మొక్కుబడులు సమర్పించుకున్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం

అచ్చంపేట: కోనూరులోగల దేవాలయ భూములను రెండు వ్యవసాయ సీజన్లకు కౌలుకు చేసుకునేందుకుగాను దేవదాయశాఖాధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. శ్రీసోమేశ్వరస్వామివారి దేవస్థానం కింద 9.06 ఎకరాల భూమి ఉండగా రూ.5,05,000లకు, శ్రీ రఘునాయకస్వామివారి దేవస్థానం కింద ఉన్న 9.55 ఎకరాల భూమిని, రూ.2,61,000లకు పాట జరిగింది. రెండు వ్యవసాయ సీజన్లు అనగా 2023–24, 2024–25 సీజన్లు అమలులో ఉంటుందని దేవాదాయశాఖా ఇన్‌స్పెక్టర్ లీలావతి తెలిపారు. ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలకు పురస్కారం




సత్తెనపల్లి: వాసవి మిత్రమండలి నర్సరావుపేట వారు నిర్వహించిన పదవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 27 మందికి ఉత్తమ సేవా అవార్డులు అందించారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన 'బెల్లంకొండ నాగసాయి ప్రసాద్' ను నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కె తిరుపాల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగసాయి ప్రసాద్‌ను రోటరీ సభ్యులు పాయసం మహేష్ బాబు, పెరుమాళ్ల లక్ష్మీ శివన్నారాయణ, బాపత్తు శ్రీనివాసరెడ్డి, చందోలు వెంకట మల్లికార్జునరావు, స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు, కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు తుమ్మల వెంకటేష్, ఆవుల మంద కమలాకర్, పొన్నూరు లక్ష్మన్ సుబ్బారావు, కృష్ణకుమారి, అనురాధ, బంధు మిత్రులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

వడ్డే సత్తెన్న విగ్రహావిష్కరణకు ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు ఆహ్వానం



సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఈ నెల 21న వడ్డే సత్తెన్న విగ్రహావిష్కరణకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను వడ్డెర సంఘ నాయకులు ఆహ్వానించారు. మంగళవారం చిలకలూరిపేటలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను వడ్డెర సంఘ నాయకులు కొమెర వీరాంజనేయులు, బత్తుల సాంబశివరావులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. వడ్డే సత్తెన్న విగ్రహావిస్కరణకు హాజరు కావాల్సిందిగా కోరి ఆహ్వాన పత్రికను అందించారు.

భూషయ్య జ్ఞాపకార్థం చలివేంద్రం



నకరికల్లు: మండువేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ ఎస్.సురేష్ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల సున్నంబట్టి వద్ద దాత వేల్పుల కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత వేల్పుల కోటేశ్వరరావు తన తండ్రి అయిన నాటకరంగ కళాకారుడు వేల్పుల భూషయ్య, తన భార్య వేల్పుల రమణల జ్ఞాపకార్థం ప్రతి ఏటా చలివేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు జనాదరణ

మంత్రి అంబటి రాంబాబు



గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో సమీక్ష చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు ..మా నమ్మకం నువ్వే జగన్'కు ప్రజల నుంచి విశేష జనాదరణ లభిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సత్తెనపల్లి రూరల్ మండలం 'జగనన్నే మా భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ సమీక్షలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో గత నాలుగేళ్లలో 98 శాతం హామీలు అమలు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 87 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. 50 శాతం పైగా ప్రజలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారని, గ్రామాల్లో ప్రత్యక్షంగా తాను గమనిస్తున్నానన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశ పెట్టి ప్రజలకు మేలు చేస్తున్నామ న్నారు. ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిన ఈ పరిపాలనతోనే 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రశాంతంగా ప్రజల వద్దకు వెళ్ళగల్గుతున్నామన్నారు. ఈనెల 20 లోగా సత్తెనపల్లి రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నూరు శాతం పూర్తి చేయాలని నిర్దేశించారు.

ఈ నెల 21 న సత్తెన్న విగ్రహావిష్కరణ...

పట్టణంలోని తాలూకా సెంటర్‌లో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వడ్డే సత్తెన్న విగ్రహ ఆవిష్కరణ ఈనెల 21వ తేదీన జరగనుందని, ఈ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, నూతన ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ రావు, గుంటూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. సమీక్షలో గుంటూరు మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రత్యామ్నాయ వ్యవస్థ అయిన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లపై ప్రత్యేక భరోసా కలిగి ఉన్నారన్నారు. మీరు చిత్తశుద్ధితో పని చేసి ప్రజల అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ మక్కెన అచ్చయ్య, పల్నాడు జిల్లా యువజన విభాగం కార్యదర్శి చిలక జైపాల్ , వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, సత్తెనపల్లి మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ బొంతు వెంకట రెడ్డి , షేక్ ఎలవర్తిపాటి ఈసా, సంకటి శ్యాంసన్, షేక్ మౌలాలి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు ఉన్నారు.

కోనూరులో మా నమ్మకం నువ్వే జగన్

క్రోసూరు: క్రోసూరు ఎస్టీకాలనీలో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయ కన్వీనర్ దుగ్గిఏడుకొండలు, గృహసారథులు శిల్ప, సత్తెటిపోతురాజు, బండియ్య, పందింటి వీరయ్య, చిల్కా దాసయ్య, బంకా కిరణ్ తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిషత్తు కార్యక్రమ వివరాలు తెలియచేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, మేదరరోశయ్య, చిల్కాదాసయ్య, చిల్కా రవి, కాలనీ కుటుంబాల వారు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడులో జగనన్నే మాభవిషత్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మంగళవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు, మండల కో ఆప్షన్ మెంబర్ సుభానీ, కాంట్రాక్టర్ పశ్యావుల నరసింహారావులు, గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లతో కలిసి జగనన్నే మా భవిషత్ కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు.

12వ వార్డులో...

సత్తెనపల్లి: 'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సత్తెనపల్లి నియో జకవర్గంలో జోరుగా సాగుతోంది. నియోజకవర్గం లోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని గ్రామాల్లో ప్రజా ప్రతి నిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తున్నారు. గత ప్రభుత్వానికి – ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని తెలియజేస్తున్నారు. ప్రతి కుటుంబానికి మేలు జరగాలి అన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు.

నార్నెపాడులో..

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్ రామలింగారెడ్డి, సచివాలయ మండల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నక్కా శ్రీనివాసరావులు నాలుగేళ్ళలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. వారి అనుమతితో జగనన్నే మా నమ్మకం స్టిక్కర్ ను అతికించారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిరిగిరి గోపాలరావు, కిశోర్, శ్రీనివాసరావు, లక్ష్మీ, ఎర్ర కోటిరెడ్డి, జక్కిరెడ్డివెంకటేశ్వరరెడ్డి, మనికెరామయ్య పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణపనులు పరిశీలించిన ఎమ్మెల్యే



దొడ్లేరులో షాదీఖానా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గంలో ముస్లింలు ఎక్కువగా అన్ని గ్రామాల్లో షాదీఖానాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో రూ.25 లక్షల నిధులతో నిర్మిస్తున్న షాదీఖానా నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అధికరంగా ఉన్న అన్ని గ్రామాల్లో షాదీఖానాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలందరూ తిరిగి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌రహీం, ఖాజా, సైదా, పల్లప్రోలు వెంకటేశ్వరరెడ్డి, సోముమస్తాన్‌రెడ్డి, మర్రి కోటిరెడ్డి, ముస్లింసోదరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



గ్యాస్ నుంచి మంటలు వెలువడితే ఎలా నియంత్రించాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తెనపల్లి: వేసవికాలంలో అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవగాహన తప్పనిసరి అని సత్తెనపల్లి అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి ఆలా శ్రీనివాసరావు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని గ్యాస్ గోదాం, పెట్రోల్ బంక్‌లు, పారిశ్రామిక వాడ ప్రాంతాల్లో మంగళవారం మాక్ డ్రిల్, డెమో నిర్వహించి ప్రత్యక్షంగా ప్రజల చేత చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో భయపడకుండా వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రమాద సమయంలో తీసుకోవల్సిన రక్షణ చర్యలను వివరించారు. అగ్నికి సంబంధించి ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయి? వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మనుషులను ఎలా కాపాడాలి, గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వెలువడినప్పుడు భయపడకుండా వాటిని ఎలా నియంత్రించాలో వివరించారు. కార్యక్రమంలో డ్రైవర్ ఆపరేటర్ సిహెచ్ సాగర్ బాబు, ఫైర్ మాన్లు కె.శ్రీనివాసరావు, ఎస్.రమణ నాయక్, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్

మంత్రి అంబటి రాంబాబు



కొమెరపూడిలో ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రంజాన్ మాసం దానధర్మాలకు ప్రతీక అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ముస్లింలకు మంగళవారం రాత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మహా పుణ్య కార్యమన్నారు. ఎంతో నీయమ నిష్ఠలతో ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటారని, అలాంటి వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం అభినందించాల్సిన విషయం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్‌ఆర్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు షేక్ ఎలవర్తిపాటి ఇస్సా, సంకటి శ్యాంసన్, చిలుకా జయపాల్, ముస్లిం సోదరులు, తది తరులున్నారు.

చలివేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి....

ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సక్రమంగా నిర్వ హించాలని రాష్ట్ర జలవనురుల శాఖామంత్రి అంబటి రాంబాబు అన్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో పట్టణంలోని తాలూకా సెంటర్, ఐదులాంతర్ల సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ చలివేంద్రాలను ఏర్పాటు చేయగా తాలూకా సెంటర్‌లోని చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, నాయకులు అచ్యుత శివప్రసాద్, షేక్ మౌలాలి, తాళ్లూరి మోహన్ బాబు,షేక్ గని, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

తండ్రి అదృశ్యం పై కుమార్తె ఫిర్యాదు



తేలవోలు వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి: తండ్రి అదృశ్యం పై కుమార్తె మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన తేలవోలు వెంకటేశ్వర్లు, వయస్సు 76 సంవత్స రాలు. గత నెల 9న మొదటి భార్యకు భరణం చెల్లించేందుకు సత్తెనపల్లి కోర్టుకు వచ్చి భరణం చెల్లించి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమార్తె నర్రా మల్లేశ్వరి చుట్టుపక్కల బంధువులను అందర్నీ విచారించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ యు.శోభన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



పెదకూరపాడు: మండలంలోని తమ్మవరం గ్రామానికి చెందిన కౌలు రైతు తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు తమ్మవరం గ్రామానికి చెందిన సొంగ వెంట్రావు (33) గత రెండేళ్లుగా తనకు ఉన్న అర ఎకరం పొలంతోపాటు, రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేస్తున్నాడు. గత ఏడాది, ఈఏడాది చీడపీడలతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో రూ. 4 లక్షలు అప్పులు చేసినట్లు మృతుడి భార్య అనూష ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగా ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని వేలాడుతుండగా, భార్య అనూష చూసి పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ప్రత్యేక వాహనంతో అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా, వైద్యశాలకు చేరుకునే సమయానికి మృతిచెందినట్లు జీజీహెచ్ వైద్యులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడికి ఇరువురు సంతానం ఉన్నారు.

జాగరణ రాత్రి(సతామి రాత్)

క్రోసూరు: పవిత్రరంజాన్ మాసంలో ఖురాన్ భువి నుంచి దివికి వచ్చిన సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని మసీదుల్లో ముస్లింలు జాగరణ రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ప్రత్యేక నమాజులు అచరించారు. ఖురాన్ పఠనాలు గావించారు. రంజాన్ మాసం విశిష్టతను ఇమాంలు తెలియచేశారు.

23న ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలికలు)లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశపరీక్ష ఈ నెల 23వ తేదీన నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ బి.వెంకటమ్మ మంగళవారం తెలిపారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: ఏపీసీసీ ప్రెసిడెంట్ గిడుగు. రుద్రరాజు ఆధ్వర్యం లోఈ నెల 24న విజయవాడలో నిర్వ హించనున్న ' జై.భారత్ సత్యాగ్రహసభ' ను విజయవంతం చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చుక్క చంద్రపాల్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం చలో విజయవాడ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రపాల్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై అన్యాయంగా సూరత్ కోర్టు లో శిక్ష వేసి వెను వేంటేనే లోక సభ సభ్యుడుగా అనర్హత వేటు వేయడం సమూచితం కాదన్నారు. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో విజయవాడ ...జై భారత్ సత్యగ్రహ సభ ను విజయవంతం చేయా లని, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, పల్నాడు జిల్లా ప్రధాన కార్య కార్యదర్శి షేక్ జానీ ఖాజావలి, నాయకులు కొత్త లక్ష్మయ్య, రామకృష్ణ మూర్తి, మామిడి శివ శంకర్, జెట్టి శేఖర్, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: పేద ప్రజలకు చేసిన సాయాన్ని వివరించి గడప గడపలో వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగాపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. లింగాపురంలో మూడవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావడంతో అయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు కావాలని కొందరు అడుగగా రెవెన్యూ అధికారులకు, సచివాలయ సిబ్బంది అర్హులైన వారందరికి రేషన కార్డులు, పింఛన్లు అందించాలన్నారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ గ్రామస్తుల తన దృష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పెంపొందించటానికి గ్రామాల్లో పారిశుద్యం మెరుగు పరచటానికి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి కోట్లాది రూపాయల నిధులు కేటాయించరన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుకొండలు, అమరయ్య, శ్రీను, పుట్టి కోటయ్య, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ హరిబాబు, మాజీఎంపీపీ వెంపా జ్వాలాల క్ష్మీనరసింహారావు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు,అళ్ల శ్రీనివాసరెడ్డి అలా లక్ష్మీనారాయణ, నండూరి కరుణకుమార్ నాయుడు రాంబాబు,చిలకా సాంబయ్య, ఎంపీడీఓ మాధురి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

మహిళల్లో ఆర్థిక చైతన్యం రావాలి



మాట్లాడుతున్న రేస్ సంస్థ డైరెక్టర్ నళిని

అమరావతి: మహిళలు తమ హక్కులను సాధించుకోవాలంటే ఆర్థికంగా చైతన్య వంతమవ్వాలని రేస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ నళిని అన్నారు. మంగళవారం స్థానిక గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో యుప్రేసియా కో ఆపరేటివ్ మహిళా సంఘం మహిళలకు నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసభకు సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నళిని మాట్లాడుతూ నానాటికి సమాజంలో స్త్రీలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. మహిళల్లో ఆర్థిక చైతన్యం, సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలంటే విద్యకూడా చాలా ముఖ్యమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చట్టాలతోపాటుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కూడా అందిపుచ్చు కోవాలన్నారు. గుడ్‌షెపర్డ్ సంస్థ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ మహిళలు గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే చిరువ్యాపారాలను ఎంచుకుని క్రమశిక్షణతో వ్యాపారాలు లాభాలు గడించవచ్చునన్నారు. ఈ ఏడాది యుప్రేసియా కో ఆపరేటివ్ సొసైటీ ఇప్పటి వరకు రూ. 15 లక్షల రూపాయల రుణాలను ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సిస్టర్ డియానా, మరియమ్మ, బ్యూలాపవన్‌తో పాటుగా మండల పరిధిలోని మహిళలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శంకరరావు



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: తోటివారిని ప్రేమిస్తూ దేవునిపై నమ్మకంతో జీవించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడులో ముస్లిం సోదరులు మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు స్వయంగా ఇఫ్తార్ విందు వడ్డించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే ప్రేమను ముస్లిం సోదరుల పట్ల చూపుతున్నారన్నారు. వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతున్నారన్నారు. షాదితోఫా, చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా ఎంతో మంది ముస్లిం మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో నంబూరు వసంతకుమారి

దొడ్లేరు(క్రోసూరు): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలందరూ ఉపవాసదీక్షలు చేపట్టి ప్రత్యేక ప్రార్థనలో గడుపుతారని, రంజాన్ మాసంలో అల్లా దయతో ముస్లిందరి ఇళ్లలో సంతోషాలనింపాలని, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి. మంగళవారం మండలంలోని దొడ్లేరు గ్రామంలో ముస్లింలు లిచ్చిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని విందును అందచేశారు.

మహిళల ఆందోళనతో యూనియన్ బ్యాంక్ మూసివేత



మూతబడిన రెంటపాళ్ళ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సత్తెనపల్లి: బంగారం మాయంలో రుణగ్రహీతలకు ఇంకా బంగారం అందక పోవడంతో మహిళలు మంగళవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆందోళన చేపట్టారు. గత జనవరి 26న బ్యాంక్ మేనేజర్, గోల్డ్ అప్రైజర్ కలిసి బంగారం మాయం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం 43 మంది రుణగ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం మాయం కాగా దాని విలువ రూ.1.52 కోట్లుగా తేల్చారు. బంగారం మాయం కావడం పై రైతులు పలు విధాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో బ్యాంక్ అధికారులు స్పందించి 43 మంది బంగారం రుణగ్రహీత లకు బంగారం స్థూల బరువుపై 9 శాతం మేకింగ్ చార్జీలు, మూడు శాతం జీఎస్టీ కలిపి పరిహారం చెల్లించ డానికి అంగీకరించి హామీ పత్రలను అందించారు. కాగా సోమవారం రుణగ్రహితలు బ్యాంక్ అధికారులను సంప్రదించగా మంగళవారానికి వాయిదా వేశారు. తిరిగి మంగళవారం రుణగ్రహితలు, మహిళలు బ్యాంకుకు వచ్చి గట్టిగా ప్రశ్నించారు. ఆ సమయంలో ఎలాంటి గొడవలు కాకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు. దీంతో బ్యాంక్ అధికారులు ఉన్నతాధికారులను సంప్రదించగా ప్రస్తుతం బ్యాంక్ మూసి వేయమని చెప్పడంతో బ్యాంక్ సిబ్బంది బ్యాంక్‌కు తాళ్ళాలు వేసి వెళ్ళారు.

ఏరియా వైద్యశాలకు ఆర్వో సిస్టం ఫ్రిడ్జ్ వితరణ



ఏరియా వైద్యశాలకు ఆర్వోప్లాంట్ సిస్టం ఫ్రిడ్జ్ అందిస్తున్న రామకృష్ణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ తన మిత్రుడి సహకారంతో రూ. 50 వేలు విలువ చేసే ఆర్వో సిస్టం ఫ్రిడ్జ్‌ను మంగళవారం వితరణ చేశాడు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు మాట్లాడుతూ ఆర్వోప్లాంట్ సిస్టం ఫ్రిడ్జ్ తో వైద్యశాలలో ఓపి కి వచ్చే రోగులందరకీ ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఎండాకాలంను దృష్టిలో పెట్టుకుని ఆర్వో సిస్టం ఫ్రిడ్జ్ అందజేయడం ఎంతో గొప్ప విషయం అని కొనియాడారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఎండాకాలం దృష్ట్యా రోగులు ఇబ్బంది పడ కూడదని, నిరంతరంగా కొనసాగే ఆర్వో సిస్టం ఫ్రిడ్జ్ కావాలని తన మిత్రుని అడగగానే వెంటనే స్పందించి ఆర్వో సిస్టం ఫ్రిడ్జ్ ఇచ్చినందుకు ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ రావు, వైద్యశాల సిబ్బంది, తది తరులు ఉన్నారు.